కార్పొరేటర్ పర్యటన


ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ మోహిద్దీన్ అబ్రార్

డబీర్‌పురా: బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఐఎం కార్పొరేటర్ మోహిద్దీన్ అబ్రార్ అన్నారు. బుధవారం డబీర్‌పురా ఫర్హత్‌నగర్‌లో ఆయన నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకురావడంతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఐఎం నాయకులు ముబీన్, అహ్మద్, మహమూద్, జిలానీ, మహ్మద్ షఫీ తదితరులున్నారు.

ఉచిత లాసెట్ కోచింగ్

నాంపల్లి: సీఎస్ఏ అకాడమీ మూడేళ్లు, ఐదేళ్ల లాసెట్–2024 ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ బషీర్‌అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అకాడమీలో కోచింగ్ వివరాలను వెల్లడించారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు మూడేళ్ల ఎల్ఎల్‌బి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఐదేళ్ల ఎల్ఎల్‌బి కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇయర్, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదివే విద్యార్థులు కూడా లాసెట్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. లాసెట్ ప్రవేశ పరీక్ష జూన్ 3న జరుగుతుందన్నారు. తరగతులు మార్చి 15 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సీఎస్ఏ అకాడమీ నిర్వహించే ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 7989787990.

సీఐటీయూ సమ్మె నోటీసు


బండ్లగూడ తహసీల్దార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

చాంద్రాయణగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ కోరారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు బండ్లగూడ తహసీల్దార్ జయమ్మకు బుధవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తుల బాగుకోసమే కేంద్రం పనిచేస్తోందని ఆరోపించారు. నాయకులు కృష్ణా నాయక్, గౌస్, హనీఫ్, వీరన్న, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్‌కు సన్మానం


సన్మానిస్తున్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: తెలంగాణ శాసనమండలి ఎమ్మెల్సీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను జంగమ్మెట్‌కు చెందిన టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు. శాసన మండలిలో ఆయనను కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. పార్టీలో దశాబ్దాలుగా పనిచేస్తున్న తమ లాంటి వారికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రెజ్లర్లకు సన్మానం


రెజ్లర్లతో కోచ్ నర్సింగ్‌రావు, ఆశోక్‌కుమార్

గోల్కొండ: రెజ్లింగ్‌పై యువతలో ఆదరణ పెరుగుతుందని ప్రముఖ రెజ్లింగ్ కోచ్‌లు కట్టా నర్సింగ్ రావు, ఆశోక్‌కుమార్‌లు అన్నారు. వారి శిక్షణలో రాటుతేలి గతవారం చెన్నైలో జరిగిన 'ఖేలో ఇండియా' రెజ్లింగ్ పోటీల్లో పతకాలు సాధించిన వారిని బుధవారం కార్వాన్ సబ్జిమండి వద్ద సన్మానించారు. ఈసందర్భంగా గజానంద్‌సింగ్‌ను వారు ఘనంగా సన్మానించారు. జాతీయ రెజ్లింగ్ పోటీలకు సైతం రెజ్లర్లను తయారు చేస్తామని తెలిపారు.

ఉస్మానియాలో కొత్త ఎంఆర్ఐ యంత్రానికి ఏర్పాట్లు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో దాదాపు 16 ఏళ్ల నాటి ఎంఆర్ఐ స్కాన్ యంత్రం స్థానంలో నూతన యంత్రాన్ని ఏర్పాటు చేయబోతున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి సుమారు 4 నెలల్లో నూతన యంత్రం ఏర్పాటు, పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే వరకు అవసరమైన రోగులకు, ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రోగులను ఎంఆర్ఐ కోసం గాంధీ ఆస్పత్రి, ఎంఎన్‌జే ఆస్పత్రులకు సూచిస్తామన్నారు. ఆస్పత్రిలో అవసరాల కోసం రెండు సీటీ స్కాన్ యంత్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు.

ఇంకెన్నాళ్లు ఇలా ?

- అనుమతులు లేకుండానే చెట్ల నరికివేత
- విద్యుత్ వైర్లకు అడ్డుతగులుతున్నాయని తొలగింపు
- ఆందోళన చెందుతున్న పర్యావరణ వేత్తలు
- ప్రత్యామ్నాయం చూడాలంటున్న ప్రజలు

చార్మినార్: విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రస్తుతం ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏదో ఒక విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు బస్తీలలో బ్రేక్‌డౌన్ కొనసాగుతోంది. ఈ మేరకు సంబంధిత సీబీడీ ఏడీఈ ముందస్తు సమాచారంగా కరెంట్ ఉండని ప్రాంతాలు అంటూ.. ప్రకటనలు విడుదల చేస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ప్రత్యామ్నాయ మార్గాలున్నప్పటికీ.. చెట్ల కొమ్మలను తొలగించడమేంటని.. ? పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పర్యావరణ వేత్తలతో పాటు పాతబస్తీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ బ్రేక్‌డౌన్ అధికారుల పర్యవేక్షణలో చెట్ల కొమ్మల తొలగింపు (నరికివేత) జోరుగా కొనసాగుతోంది.


చెట్ల నరికివేతపై టీఎస్ఎస్‌పీడీసీఎల్ ప్రకటన

వారంలో ఏదో ఒకరోజు..

ప్రతి వారంలో రెండు, మూడ్రోజులు ఏదో ఒక సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పాతబస్తీ దక్షిణ మండలంలోని చార్మినార్, ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌ల పరిధిలోని సీబీడీఏడీఈ పరిధుల్లో నిరంతరం కొనసాగుతోంది. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డు తగులుతున్నాయనే కారణాలతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ బ్రేక్‌డౌన్ అధికారులు, సిబ్బంది ఎక్కడికక్కడ పచ్చదనానికి గొడ్డలి పెడుతున్నారు.

ఇష్టానుసారంగా నరికివేత..

అవసరం ఉన్నా... లేకున్నా పెద్ద పెద్ద కొమ్మలను తొలగిస్తున్నారని, ఈ కొమ్మలను అక్కడి నుంచి తొలగించకుండా అలాగే రోడ్డుపై వదిలేసి వెళ్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇష్టానుసారంగా చెట్లను నరుకుతుండటంతో ఆయా బస్తీల్లో పచ్చదనం కనుమరుగవుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలున్నప్పటికీ.. ఆ దిశలో స్పందించడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.


గాంధీనగర్‌లో కొమ్మలు తొలగించిన అనంతరం సగం చెట్టు

ఏబీ కేబుల్ ఏర్పాటు చేస్తే ఆశించిన ఫలితాలు..

వీధి దీపాలతో పాటు డొమెస్టిక్, కమర్షియల్ విద్యుత్ సరఫరా కోసం బస్తీల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డుతగులుతున్నాయనే కారణంతో తొలగించే దానికి స్వస్తి పలకాలంటే ఏబీ కేబుల్ (ఎయిర్ బంచ్) వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు సూచిస్తున్నారు.

భారీ బడ్జెట్ అవసరం..

- ఏబీ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు భారీ బడ్జెట్ అవసరం ఉంటుందనిసంబంధిత విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఎల్టీ (70 స్క్వేర్ ఎంఎం), హెచ్‌టీ (180 స్క్వేర్ ఎంఎం) లైన్‌లలో ఏబీ కేబుల్ వ్యవస్థను తీసుకొస్తే ఆశించిన ఫలితాలుంటాయంటున్నారు. సాధారణ లైన్లను ఏబీ కేబుల్ కింద మార్చేందుకు మూడు రెట్లు ఖర్చు అవుతుందని, అందుకే ఏబీ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడం లేదంటున్నారు.

ప్రమాదాలు సైతం తగ్గుముఖం..

ఏబీ కేబుల్ అందుబాటులోకి వస్తే పచ్చదనాన్ని కాపాడటంతో పాటు విద్యుత్ ప్రమాదాలు సైతం తగ్గుతాయని స్థానికులు చెబుతున్నారు.

బోసిపోతున్న వీధులు..

టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని బస్తీల్లో చెట్టు కొమ్మలను తొలగించడంతో ఆ ప్రాంతం ప్రస్తుతం బోసిపోయి కనిపిస్తోంది. చెట్లను పెంచకపోగా... ఉన్న వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని, పలు కారణాలతో వాటిని తొలగించడం సరికాదని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందన


ప్రజల ఫిర్యాదులను పరిశీలిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తన వద్దకు వచ్చిన ఫిర్యాదులు, వినతి పత్రాలను ఎప్పటికప్పుడే పరిశీలించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమకు వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపైనే ఉంటున్నాయన్నారు. అర్హులైన వారిని గుర్తించి వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నానన్నారు. మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని దళారుల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్వాన్ నియోజకవర్గంలో స్వయంగా తాను పర్యటిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నానని తన పర్యటనలో జలమండలి, బల్దియా, విద్యుత్‌శాఖ అధికారులు ఉంటున్నారని సమస్యలు నేరుగా వారే తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ తదితర డివిజన్‌లలో జరుగుతున్న డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, వజీఉజ్‌జమా, షబ్బీర్‌ఖాన్, హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ ధరావత్ జానకీ

సంతోష్‌నగర్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సౌత్, ఈస్ట్‌జోన్ డీసీపీ ధరావత్ జానకీ రౌడీషీటర్లను హెచ్చరించారు. బుధవారం ఆమె సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్‌గౌస్‌తో కలిసి ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఐ.ఎస్.సదన్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆమె కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. రౌడీషీటర్ల నేర ప్రవృత్తిని మానుకుని సమాజంలో మంచి వ్యక్తులుగా మెలుగుతూ కుటుంబంతో సంతోషంగా జీవించాలని సూచించారు. అర్ధ రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ.. ఛబుత్రాలపై తిష్ట వేయడం లాంటివి చేయకూడదని చెప్పారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉండాలని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్, ఎస్సైలు, సిబ్బంది తదితరులున్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర


ప్రశంసాపత్రాలతో ఉపాధ్యాయుల బృందం

గోల్కొండ: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని సహాయత ట్రస్ట్ ప్రతినిధి జనాబ్ ఇర్ఫాన్ అన్నారు. గోల్కొండ నయా ఖిలా ఉర్దూ హైస్కూల్‌లో సహాయత ట్రస్ట్, ఇండో యూఎస్ ఆస్పత్రి నిర్వహించిన రెండ్రోజుల మెగా మెడికల్ క్యాంప్‌లో వాలంటీర్లుగా పనిచేసిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ఆయన ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాబోధనలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీగా ఉండే ఉపాధ్యాయులు సమాజసేవలో కూడా పాల్గొనడం వారి వృత్తి ధర్మానికి అద్దం పడుతుందన్నారు. ఓ వైపు సమాజ నిర్మాణం చేస్తూనే సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ.. అత్యున్నత పదవులు అలంకరించిన వారు ఎందరో ఉన్నారని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఏపీజే అబ్దుల్ కలాం తదితరులు దీనికి నిదర్శనమన్నారు. సహాయత ట్రస్ట్ గత రెండు దశాబ్దాలుగా పేద, బడుగు వర్గాలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. వస్తుందని ఆయన అన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు చేయడమే కాకుండా వారికి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నామన్నారు. పేద ప్రజలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లోనే తాము ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనాథలు, తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి వారికి ఉచితంగా విద్యను కూడా అందిస్తున్నామన్నారు. ప్రతిభ గల వారికి ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నామన్నారు. కరోనా కష్టకాలంలో వలస కూలీలు, నిరుపేద స్థానిక కూలీలతో పాటు ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకున్నామన్నారు. సహాయత ట్రస్ట్ ప్రతినిధి షోహెబ్ తదితరులున్నారు.

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి


సందీప్‌కుమార్ సుల్తానియాకు వినతి పత్రం అందజేస్తున్న విక్రమ్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం బీసీ సంఘాల పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం 18 శాతం మాత్రమే బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. గతంలో 34 శాతం ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లను గత ప్రభుత్వం 22 శాతానికి కుదించి తీవ్ర అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ జనాభా లెక్కలు బయటకు తీసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నాంపల్లి: అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ సర్కిల్–12 అధికారులు చర్యలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని ఏసీగార్డ్స్‌లో అక్రమంగా ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. రెండంతస్తులకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని మొత్తం ఐదంతస్తులను నిర్మించారు. ఈ భవన నిర్మాణంపై వరుస ఫిర్యాదులు అందడం, భవన యజమానులకు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి పర్యవేక్షణలో అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సిబ్బంది మోహన్‌కుమార్, సురేష్, ఇతర ప్రైవేట్ వ్యక్తులు పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్‌లో ఇద్దరిపై వేటు



మాట్లాడుతున్న రాంబాబుయాదవ్

అబిడ్స్: వాటర్‌వర్క్స్ ఉద్యోగుల సంఘం (వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ) నుంచి రాజిరెడ్డి, జహంగీర్లను తొలగించినట్లు వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ తెలిపారు. యూనియన్, కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు రాజిరెడ్డి, జహంగీర్లను సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు బుధవారం గోషామహల్‌లోని యూనియన్ ప్రధాన కార్యాలయంలో అధ్యక్షులు రాంబాబుయాదవ్‌తో పాటు యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొని ప్రకటన చేశారు. ఈ సందర్భంగా రాంబాబుయాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మారడంతో గత కొంతకాలంగా తమ సొంత ప్రయోజనాల కోసం యూనియన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందునే సస్పెండ్ చేశామన్నారు. అనేకసార్లు పద్ధతి మార్చుకోవాలని వారించినా మార్పులేకపోగా.. మరింత తప్పుడు పద్ధతులకు పాల్పడుతూ.. కార్మికులకు నష్టకరమైన చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ యూనియన్ అందరిదనీ దీన్ని కాపాడుకుని అందరం కలిసికట్టుగా ఉండి పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జనరల్ సెక్రటరీ జైరాజ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్తర్‌అలీ, లక్ష్మీనారాయణ, మేడ్చల్ శ్రీనివాస్, ఎల్లమయ్య, జంగయ్య, కొమురయ్య తదితరులున్నారు.

దేవాలయ భూములను పరిరక్షించాలని వినతి



సుల్తాన్‌బజార్: దేవాలయాల భూములను సంరక్షించాలని భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ అనిల్‌కుమార్‌కు సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్. లక్ష్మణ్‌రావు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఫీల్‌ఖానాలోని మహాదేవ్ దేవాలయంలో కొందరు అక్రమార్కులు అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారని ఆయన మండిపడ్డారు. దీనిపై దేవాదాయశాఖ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. న్యాయస్థానంలో కేసు ఉన్నందున ఇలాంటి కట్టడాలను నిర్మించడం ఎంతవరకు సబబు.. ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా దేవాదాయ భూములను పరిరక్షించాలని ఆయన కోరారు. దీనిపై తగిన చర్యలు తీసుకుని నిర్మాణాలను ఆపివేయాలని కోరారు.

కాంట్రాక్ట్ నర్సుల అరెస్ట్

పోలీస్‌స్టేషన్‌లోనే భైఠాయించి ఆందోళన

నాంపల్లి: సీఎం రేవంత్‌రెడ్డికి తమ గోడును విన్నవించడానికి ఎల్బీస్టేడియానికి వస్తే పోలీసులు తమను అన్యాయంగా అరెస్టు చేశారంటూ.. 9 మంది బాధిత కాంట్రాక్టు నర్సులు నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేశారు. బుధవారం స్టాఫ్ నర్సులకు ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఎల్బీ స్టేడియం వద్ద అరెస్టు చేసి నాంపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని ప్రజా దర్బార్, సచివాలయానికి వెళ్లిన పట్టించుకోకపోవడంతో ఎల్బీ స్టేడియానికి వెళ్లామని వారు వివరించారు. కరోనా విపత్కర సమయంలో కుటుంబ సభ్యులను వదులుకుని తమ ప్రాణాలు పణంగా పెట్టి సేవలు చేశామన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి తమ ఆవేదనను అర్థం చేసుకుని తమను క్రమబద్ధీకరించాలని కోరారు. మనిషా, మేఘమాల, విజయ, కీర్తి, ఈస్తర్, రత్న, ప్రభ, కావ్య, సత్య ఉన్నారు.

భార్యతో గొడవపడి వ్యక్తి అదృశ్యం


సయ్యద్ షాబాజ్ ఉద్దీన్ ఖాద్రీ (ఫైల్)

డబీర్‌పురా: భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఇంటి నుంచి అదృశ్యమైన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాకుత్‌పురా ఇమ్లిబన్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షాబాజ్ ఉద్దీన్ ఖాద్రీ (25) గత నెల 29న భార్యతో చిన్నపాటి విషయమై గొడవ పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన షాబాజ్ ఖాద్రీ ఇంట్లోని కుటుంబసభ్యులకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఎగ్జిబిషన్‌లో గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్


ముజైర్ హైదర్

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో ఫిబ్రవరి 2, 4 తేదీల్లో గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ముజైర్ హైదర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం హిందుస్థాని కవి సమ్మేళన్, ముషైరా వేడుకలను చేపడుతున్నామన్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు కల్చరల్ లాన్‌లో వేడుకలు కొనసాగుతాయన్నారు. 4న ఆదివారం బాలీవుడ్ ప్రముఖుడు జావేద్‌అలీ మెమోరి మ్యాజిక్ షో నిర్వహిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు జావేద్‌అలీ మ్యాజిక్ షోను ప్రదర్శిస్తారన్నారు. ప్రపంచంలోనే ప్రముఖుడైన ఆయన ఎగ్జిబిషన్‌కు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులతో పాటు సందర్శకులు పెద్దఎత్తున పాల్గొంటారన్నారు. గ్లోబల్ కల్చరల్ వేడుకలతో సందర్శకులకు ఉల్లాసం, ఉత్సాహం, ఆనందం ఎగ్జిబిషన్ సొసైటీ తరపునా అందిస్తామన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కో- ఆర్డినేటర్ విజయ్‌కుమార్

అబిడ్స్: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బుధవారం గురుకుల పాఠశాలలో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. హైదరాబాద్ రీజినల్ లెవెల్ కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల జూబ్లీహిల్స్ బాలుర వన్ ప్రిన్సిపాల్ పైళ్ల శేఖర్‌రెడ్డిలు ఉపాధ్యాయుల బృందాలు పలు ప్రాంతాల్లో పర్యటించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తూ వారిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఐదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు అడ్మిషన్లు తీసుకుంటామని వివరించారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ సెక్షన్లకు అడ్మిషన్లు ఉంటాయని వారు తెలిపారు. పాతబస్తీతో పాటు అన్ని ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

సీఎస్‌టీయూ మహిళా ఉద్యోగికి సత్కారం


సత్కరిస్తున్న వీసీ ఆచార్య తంగెడ కిషన్‌రావు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని చిత్రవాణి స్టూడియోలో ఆఫీస్ సబార్డినేట్‌గా గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న ఎస్.విజయ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు ఘనంగా సత్కరించి ఆమెకు వీడ్కోలు పలికారు. కిషన్‌రావు మాట్లాడుతూ... ఉద్యోగులు ఎంతకాలం పనిచేశారనేది ముఖ్యం కాదని, ఎంత నిబద్ధతతో పనిచేశారనేదే ముఖ్యమని గుర్తు చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, విస్తరణల సేవా విభాగం ఇన్‌చార్జ్ రింగు రామ్మూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని సత్కరించారు.

నర్సింగ్ నియామకాలను స్వాగతిస్తున్నాం


సుల్తాన్‌బజార్: సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రభుత్వ హయంలో 6 వేలకు పైగా నర్సింగ్ ఆఫీసర్లకు నియామకపత్రాలను అందజేయడాన్ని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాబర్ట్ బ్రూస్, జె.అశోక్‌లు స్వాగతించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. మెగా నర్సింగ్ నియామక ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ధైర్యంగా నిర్వహించడం సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాల పనితనానికి నిదర్శనమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దిగ్విజయంగా నిర్వహించాలని కోరారు.

శాస్త్రీయ సంగీతం పుస్తకావిష్కరణ




గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సత్కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ ఎం.పురుషోత్తమచార్య రచించిన తెలుగు చలనచిత్ర గీతాలలో శాస్త్రీయ సంగీతం పుస్తకావిష్కరణ సభ బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ.. 1961 లోనే శాస్త్రీయ సంగీతాన్ని ప్రేక్షకులకు వినిపించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అంతకు ముందు గాయనీగాయకుల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ప్రముఖ సినీరచయిత వేద్దపల్లి కృష్ణ, సంగీత దర్శకులు స్వరవీణాపాణి, విమర్శకులు హెచ్.రమేష్‌బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మధుమోహన్ తదితరులున్నారు.

రాహుల్‌గాంధీపై దాడి సరికాదు



గౌలిపురా: వెస్ట్ బెంగాల్‌లోని మాల్దాలో రాహుల్ గాంధీ కారుపై దుండగుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టిన నాటి నుంచి నిత్యం ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. ఇటీవల మణిపూర్‌లో యాత్రను అడ్డుకున్న సంగతి తెలిసిందేనన్నారు. ఈరోజు మాల్దాలో రాహుల్‌గాంధీ వాహనంపై దాడి చేయడం రాజకీయ కుట్రలో భాగేమనన్నారు. లక్షలాది మంది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అండగా ఉన్నారని.. ఈ దేశ ప్రజల మద్దతు ఆయనకు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు అండగా నిలవాలని.. పేదలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో తలపెట్టిన యాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతుందన్నారు.

రక్తదాన శిబిరం



సుల్తాన్‌బజార్: అన్ని దానాల కంటే రక్తదానం ఇతరుల ప్రాణాలను రక్షించేలా ఉంటుందని బీజేపీ జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. వివేకవర్ధిని ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం జాంబాగ్‌లోని వివి కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలు దక్కుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆయన కోరారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్క పౌరుడు ముందుకు రావాలని ఆయన కోరారు. వివేకావర్ధిని ప్రిన్సిపల్ విద్యాధర్, లెక్చరర్లు నవీన్ బండారి తదితరులు పాల్గొన్నారు.